క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న న్యాయవాది రాజేంద్రప్రసాద్ మిత్రబృందం

నెల్లూరు(అర్బన్) : రక్తదానం ప్రాణదానంతో సమానమని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యుడు, న్యాయవాది దాసరి రాజేంద్రప్రసాద్ అన్నారు. రక్షాబంధన్ పండగను పురస్కరించుకుని నగరంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో రాజేంద్రప్రసాద్ తన మిత్రులతో సోమవారం రక్తదానం చేయించారు. అలాగే రాజేంద్రప్రసాద్ 50వ దఫా రక్తదానం చేశారు. అనంతరం అక్కడి ఎంఎస్సార్ స్పాస్టిక్ సెంటర్(మానసిక దివ్యాంగుల కేంద్రం)లో పిల్లల మధ్య ఘనంగా రాఖీ పండగను నిర్వహించారు. కార్యక్రమంలో రక్తదాతలు నిరంజన్ రవికుమార్, కేశవులు, ఆశ్రిత్, మెడికల్ ఆఫీసర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం



సబ్‌స్టేషన్ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గ పరిధిలోని 24వ డివిజన్ కల్లూరుపల్లిలో రూ.4 కోట్ల నిధులతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ అరవ శాంతి, డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మంత్రితో ఐజీ భేటీ



నెల్లూరు(క్రైమ్): మంత్రి నారాయణను నగరంలోని ఆయన నివాసంలో గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణపై చర్చించారు.

మున్సిపల్ పాఠశాలలో రక్షాబంధన్



రాఖీలు కడుతున్న చిన్నారులు

నెల్లూరు (టౌన్) : స్థానిక కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న చెల్లెలు, అక్క తమ్ముళ్లతో రాఖీ కట్టించి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కరరావు, విద్యా వలంటీర్ రాశి, తదితరులు పాల్గొన్నారు.

'డీకేడబ్ల్యూ'లో సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగంలో పోషక బిస్కెట్ల తయారీ అను అంశంపై సర్టిఫికెట్ కోర్సును సోమవారం ప్రారంభించారు. కోర్సుకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించిన అనంతరం ప్రిన్సిపల్ గిరి మాట్లాడారు. వివిధ అంశాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ప్రసాద్, లైబ్రేరియన్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వామివారి విగ్రహ ప్రతిష్ట

వెంకటాచలం : మండలంలోని తిక్కవరప్పాడు గ్రామంలో అయ్యప్పనాయుడు స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహాకుంభాభిషేక మహోత్సవాలు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, దీక్షారాధనం, అఖండస్థాపన, సాయంత్రం 6.30 గంటలకు వేదపారాయణం, జలాధివాసం, అగ్నిప్రతిష్ఠ, వాస్తు హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు మంత్ర పారాయణం, అష్టగణపతి హోమం, నవగ్రహ హోమం, గ్రామదేవతల హోమం, సుదర్శన హోమం, రుద్ర హోమం, మధ్యాహ్నం 3 గంటలకు స్వామివారి ఊరేగింపు ఉంటుందన్నారు. చివరి రోజు గురువారం 8 గంటలకు అయ్యప్పనాయుడు స్వామి, మహాగణపతి, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలను శతాధిక ప్రతిష్ఠాపనాచార్యులు బ్రహ్మశ్రీ గాడేపల్లి ప్రశాంత్‌శర్మ చేతుల మీదుగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వేడుకగా శ్రావణ పౌర్ణమి

శ్రావణ మాస పౌర్ణమిని పురస్కరించుకుని నగరంలోని ఆలయాల్లో సోమవారం విశేష పూజలు జరిగాయి. భక్తులు ఉదయాన్నే ఆలయాలకు పోటెత్తి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని శంకర మఠం ప్రాంగణంలో కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో చండీహోమం నిర్వహించారు. కంచికామకోటి పీఠానికి చెందిన సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన చండీహోమంలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా కొత్రపాటి సంతోష్ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను మఠం నిర్వాహకులు నందకిశోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

54 కిలోల పసుపు కుంకుమతో అభిషేకం

కరెంటాఫీస్ సెంటర్ వద్ద ఉన్న శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి సౌభాగ్యసిద్ధి కోసం పలు రకాల ద్రవ్యాలు, 54 కిలోల పసుపు కుంకుమతో సోమవారం అభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళలతో సామూహిక కుంకుమార్చన చేశారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవమూర్తి విశేష పుష్పాలంకరణలో భక్తులను కటాక్షించారు. కార్యక్రమాలను దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్, ఈఓ జె.వెంకటసుబ్బయ్య, సిబ్బంది, అర్చకులు పర్యవేక్షించారు.

వ్యాసరాజమఠంలో..

సంతపేట బ్రాహ్మణవీధిలోని వ్యాసరాజమఠంలో విశేష పూజలు నిర్వహించారు. తొలుత శాస్త్రోక్తంగా ఉపాకర్మను జరిపించారు. మఠంలోని శ్రీరమా సత్యనారాయణ స్వామి మందిరంలో స్వామివారికి వ్రతం, సాయంత్రం పల్లకిసేవ వేడుకగా నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా అరవపల్లి సుజాత, సుబ్బారావు దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో సింహపురి మధ్వసంఘం అధ్యక్షుడు దేవరసు ప్రవీణ్, పత్రి గురురాజ, మధ్వసంఘీయులు పాల్గొన్నారు. తడకపల్లి రవీంద్రబాబు పర్యవేక్షించారు.



సామూహిక కుంకుమ పూజలో భక్తులు



పుష్పాలంకరణలో శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు

⇨ వేదాయపాళెం మహాత్మా గాంధీనగర్‌లో ఉన్న శ్రీకృష్ణమందిరంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు బి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన వ్రతంలో మహిళలు అధికంగా పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. ఉభయకర్తలుగా బిజ్జం విజయకుమార్‌రెడ్డి, వాణిమల్లీశ్వరి దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను మందిర ధర్మకర్త చిత్తూరు వెంకటేశ్వర్లు, కమిటీ ఉపాధ్యక్షుడు ఎస్.వేణుబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్.సుబ్బరామరాజు పర్యవేక్షించారు.



శంకరమఠంలో చండీహోమం



వ్యాసరాజమఠంలో..



శ్రీకృష్ణమందిరంలో సత్యనారాయణస్వామి వ్రతం

ఉద్దేశపూర్వకంగా అసత్య ఆరోపణలు

నెల్లూరు(బారకాసు): తాను ఎవరినీ మోసం చేయలేదని, ఉద్దేశపూర్వకంగా తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని వర్ల విశ్వనాథ్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వర్ల కొండయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పలువురు సభ్యులతో కలిసి ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. తాను ట్రస్ట్ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాని తెలిపారు. అయితే చెన్నై ట్రస్ట్ వారు సభ్యులకు ఇచ్చే ఆర్థిక సహాయంలో ఓ మహిళ సగం వాటా కావాలని కోరగా, అందుకు తాను ఒప్పుకోలేదన్నారు. దీంతో సభ్యులందరూ మోసం చేస్తున్నారంటూ అసత్య ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు. సభ్యులందరూ అంగీకరిస్తే వారి సభ్యత్వాలను రద్దు చేయించి వారి కట్టిన నగదును తిరిగి చెల్లిస్తానని హామీ ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సభ్యులు సుభాన్, ఖాజామోహిద్దీన్, బాబు, రవీంద్రరెడ్డి, హైమావతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కమిషనర్

నెల్లూరు(బారకాసు) : సీఎం చంద్రబాబునాయుడును నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సోమశిలలో సీఎం పర్యటన సందర్భంగా ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలి

• ఎస్ఈ సంపత్‌కుమార్

నెల్లూరు(బారకాసు) : సమస్యల పరిష్కారంపై ప్రజలు ఇస్తున్న అర్జీలను వేగంగా పరిష్కరించాలని కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ సంపత్‌కుమార్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ సమస్యను బట్టి అవసరమైతే విభాగాధిపతులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని చెప్పారు. ప్రజల నుంచి అందిన అర్జీలను సమగ్రంగా పరిష్కరించి, పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఎన్ఎంసీ కార్యాలయానికి వస్తున్నారని, వాటిని స్థానికంగానే పరిష్కరించాలని తెలిపారు.

14 అర్జీల స్వీకరణ

వివిధ సమస్యలపై ప్రజల నుంచి 14 అర్జీలు అందాయని ఎస్ఈ తెలిపారు. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి 6, టౌన్‌ప్లానింగ్ విభాగానికి 2, పబ్లిక్ హెల్త్ విభాగానికి 2, హౌసింగ్ విభాగానికి 4 చొప్పున ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ దేవీకుమారి, మేనేజర్ ఇనాయతుల్లా, టీపీఓ దశయ్యతో పాటు పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజల అర్జీలను పరిశీలిస్తున్న ఎస్ఈ సంపత్‌కుమార్

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ : నగరంలోని ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు అండగా ఉంటానని ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి తెలిపారు. రూరల్ మండలంలోని చింతారెడ్డిపాళెంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ నివాసంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు చేసే అరాచకాలను ఎదురొడ్డి పోరాటం చేస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు ఎంతటి కష్టం వచ్చినా అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డితో కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆనం జయకుమార్‌రెడ్డి, రూరల్ మండలం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వానర బెడద.. తీరేదెన్నడో?

• నెల్లూరు నగరంలోని హరనాథపురానికి చెందిన సుజాత కుటుంబసభ్యులతో నరసింహ స్వామి కొండకు వెళ్లింది. తన రెండేళ్ల కుమారుడితో అమ్మవారి దర్శనానికి వెళ్తుండగా తన చేతిలోని వస్తువులను కోతులు లాక్కెళ్లాయి. దీంతో ఒక్కసారి ఆ మహిళ భయభ్రాంతులకు గురైంది.

• వేదాయపాళెనికి చెందిన సురేష్ తన తొమ్మిదేళ్ల కుమార్తెను దర్శనానికి తీసుకెళ్తుండగా కోతులు అరుపులు, కేకలతో చిన్నారి భయంతో పరుగులు తీసి మెట్ల వద్ద పడింది. సమయానికి తండ్రి సురేష్ అక్కడే ఉండడంతో ప్రమాదం తప్పింది.

• నరసింహకొండపై భక్తులపై దాడులు
• నగరంలోని పలు డివిజన్లలో స్వైరవిహారం



అమ్మవారి దర్శన మార్గంలో కోతులు

నెల్లూరు సిటీ : నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహస్వామి కొండపై కోతుల స్వైరవిహారం చేస్తున్నాయి. దర్శనానికి వచ్చే భక్తులపై కోతులు దాడులకు దిగడంతో వారు గాయాలపాలవుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు. జిల్లాలో ప్రాముఖ్యత కలిగిన ఆలయాల్లో నరసింహస్వామి ఆలయం ఒకటి. కొండపై ఆలయం ఉండడంతో భక్తులు కుటుంబ సమేతంగా నరసింహుడిని దర్శించుకుంటారు. శని, ఆదివారాల్లో భక్తుల రాక మరింత ఎక్కువగా ఉంటుంది.

అమ్మవారి దర్శన మార్గంలో..

నరసింహస్వామి కొండపై వెలిసిన ఆదిలక్ష్మి అమ్మవారి దర్శన మార్గంలో మెట్ల వద్ద కోతుల బెడద మరింత ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో దర్శనానికి వచ్చే భక్తులపై కోతులు దాడి చేస్తున్నాయి. చేతుల్లో ఉండే వస్తువులను లాక్కెళ్లడం, దాడులకు దిగడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు.

చర్యలు తీసుకోని ఆలయాధికారులు

కోతుల బెడదపై ఆలయ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కోతుల పట్టివేతను అప్పుడప్పుడూ చేస్తున్నట్లు లెక్కలు చూపి దోచుకుంటున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

53, 54 డివిజన్లలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని 53, 54 డివిజన్ల పరిధిలోని వెంకటేశ్వరపురం, గాంధీ గిరిజన కాలనీ, ఇస్లామ్‌పేట, జనార్దన్‌రెడ్డి కాలనీ ప్రాంతాల్లో వానరాల బెడద ఎక్కువగా ఉంది. గతంలో విజయ డెయిరీలో చెట్ల మధ్య ఉండే కోతులు ప్రస్తుతం నివాసాల మధ్య సంచరిస్తూ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో స్కూల్‌కు వెళ్లే చిన్నారులపై కోతులు దాడి చేసి గాయపరుస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం గాంధీ గిరిజన కాలనీకి చెందిన శివప్రియ అనే ఒకటో తరగతి విద్యార్థినిని వెంకటేశ్వరపురంలోని స్కూల్ నుంచి తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో దాడి చేసి తల, చేతిపై తీవ్ర గాయాలు చేశాయి. గతంలో కోతులు ఎక్కువ ఉన్న డివిజన్లలో ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి వాటిని పట్టి దూరప్రాంతాల్లో విడిచి పెట్టేవారు. అయితే కొన్ని నెలలుగా దీని గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా కోతుల బెడద నుంచి కాపాడాలని సంబంధిత అధికారులను స్థానికులు కోరుతున్నారు.



కోతుల దాడిలో గాయపడిన చిన్నారి

నేటి నుంచి పశువులకు టీకాలు

ఇందుకూరుపేట : ఈనెల 20వ తేదీ నుంచి సెప్టెంబర్ 19వ తేదీ వరకు నెలరోజుల పాటు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తామని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మురళీకృష్ణ సోమవారం కోరారు. జాతీయ పశు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా అందిస్తున్న టీకాలను పశువులకు వేయించి గాలికుంటు వ్యాధి నుంచి కాపాడుకోవాలని ఏడీ కోరారు.

వైఖానస మహర్షికి విశేష పూజలు

నెల్లూరు సిటీ : రూరల్ మండలం నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వైఖానస మహర్షి జయంతి సందర్భంగా యాగశాలలో ఆయనకు అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు అభిషేకం, గరుడ సేవ, గిరిప్రదక్షిణ ఉత్సవాలు జరిపారు. ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. గరుడసేవ ఉభయకర్తలుగా ఆరణి కందప్ప మేస్త్రి సత్రం కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈఓ సుధీర్, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్సవ మూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

• ఐదో రోజుకు జూడాల సమ్మె

నెల్లూరు(అర్బన్): కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కళాశాల మహిళా డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, అప్పటివరకు తమ పోరాటం ఆగదని జూనియర్ డాక్టర్లు ప్రకటించారు. జూడాలు చేస్తున్న సమ్మె సోమవారానికి ఐదో రోజుకు చేరుకుంది. ఈ మేరకు వారు నగరంలోని పెద్దాస్పత్రిలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారికి ఆస్పత్రి రెగ్యులర్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకుడు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషాబాషా మద్దతు ప్రకటించి, మాట్లాడారు. డాక్టర్లకు రక్షణ కల్పించకుండా రోగులకు వైద్యం చేయాలని కోరడం సమంజసం కాదన్నారు. విధుల్లో ఉన్న డాక్టర్లపై దాడులు జరగకుండా ప్రభుత్వాలు కఠిన చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. జూడాల అసోసియేషన్ అధ్యక్షుడు జునైద్ అలీ అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేస్తే తక్షణమే విధుల్లో చేరుతామని స్పష్టం చేశారు. తమ ఆందోళనలపై రాజకీయ నాయకులు స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీనునాయక్, విద్యాచరణ్ మద్దతు ప్రకటించారు.

సమ్మెతో రోగుల అవస్థలు

జూడాల సమ్మెతో పెద్దాస్పత్రిలో రోగులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఆస్పత్రిలోని 195 మంది జూనియర్ డాక్టర్లు, మరో 25 మంది వరకు పీజీ డాక్టర్లు సమ్మె బాట పట్టడంతో రోగులకు సకాలంలో వైద్యసేవలందడం లేదు. అత్యవసరం కాని ఆపరేషన్లు, చిన్న శస్త్ర చికిత్సలు వాయిదా వేస్తున్నారు.



పెద్దాస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న జూడాలు

కఠిన చట్టాలు చేయాలి

నెల్లూరు (టౌన్) : కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులకు శిక్ష పడేలా చట్టాలు చేయాలని విద్యార్థి యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కరెంటాఫీసు సెంటర్ నుంచి మెడికల్ కళాశాల వరకు సోమవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్య విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టాలు ఎన్ని ఉన్నా ఆడపిల్లలకు భద్రత లేకుండా పోతోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి నరేంద్ర, శ్రీహర్ష, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్‌షరీఫ్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నరసింహ, రమణ, నాయకులు చరణ్, జీవన్, విష్ణు, పవన్, యశ్వంత్, ప్రశాంత్, చైతన్య, సాయి, నరసింహ, ఆల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

నెల్లూరు(అర్బన్) : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని స్థానిక డైకస్‌రోడ్డులో సోమవారం ఘనంగా నిర్వహించారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(పీహెచ్‌పీ), రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా కెమెరాను ప్రపంచానికి పరిచయం చేసిన లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఫొటోగ్రఫీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొంతి శ్రీధర్ మాట్లాడారు. పెద్ద సమస్యలను సైతం ఒక్క ఫొటోతో తెలిపే సృజనాత్మకత ఫొటోగ్రాఫర్లలో ఉండాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌పీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, రూడ్స్ చైర్మన్ రసూల్, పీహెచ్‌పీ నాయకులు షేక్.సత్తార్, గోరంట్ల శేషయ్య, శేఖర్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



లూయిస్ డాగురే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రక్తహీనత సమస్యను అధిగమించాలి

ఇందుకూరుపేట : గర్భిణులు తగిన పౌష్టికాహారం తీసుకుని అనీమియా, రక్తహీనత సమస్యలను అధిగమించాలని జగదేవిపేట పీహెచ్‌సీ హెల్త్‌ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు అన్నారు. మండలంలోని పల్లిపాడులో గర్భిణులు, బాలింతల నివాసాలకు సోమవారం ఆయన వెళ్లి పరీక్షించి వారికి తగిన సూచనలు చేశారు. మనకు అందుబాటులో తక్కువ ఖర్చుతో లభించే పౌష్టికాహార పదార్థాల గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు